క్లుప్తంగా

గడియార స్తంభానికి మోక్షం!



సామర్లకోటలోని గడియార స్తంభాన్ని పరిశీలించిన అధికారులు

సామర్లకోట: గత తెలుగుదేశం పాలనలో అసంపూర్తిగా నిలిచిన గడియారం స్తంభం పనులు ప్రారంభించడానికి అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు కొడా నుంచి నిధులు విడుదల అయ్యేలా చర్యలు తీసుకున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. దీనిలో భాగంగా గురువారం అధికారులు గడియార స్తంభాన్ని పరిశీలించి, కొలతలు తీసుకొన్నారు. ఈ మేరకు చేయాల్సిన పనులకు సంబంధించి అంచనాలు తయారు చేయనున్నట్టు సంబంధిత అధికారి బాషా షేక్ తెలిపారు. కౌన్సిలర్ బలుసు వాసు, రైతు సంఘ నాయకుడు కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు



విద్యుద్దీపాలంకరణలో బాబా ఆలయం

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో దత్తాత్రేయ, సమేత శిరిడీ సాయి ఆలయంలో శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు గురుపౌర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.అప్పారావు, కార్యదర్శి జి.సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం నుంచి 21 తేదీ వరకు నిత్యం ప్రత్యేక పూజలు ఉంటాయని, 20న కోలాటం, స్వామివారి ఊరేగింపు, 21న ప్రత్యేక అభిషేకాలు చేయనున్నారని, అనంతరం 11 గంటల నుంచి స్థానిక రైల్వే కల్యాణ మండపంతో అన్నదానం ఉంటుందని చెప్పారు.

ప్రతి విద్యార్థి విజ్ఞానాన్ని పెంచుకోవాలి

బిజినెస్ గురు రమేష్ భటవ్యా



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న రమేష్ భటవ్యా

పెద్దాపురం: ప్రతీ విద్యార్థి పాఠ్య పుస్తకాల ద్వారా వచ్చే జ్ఞానం కంటే అంతకు మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని బిజినెస్ గురు రమేష్ భటవ్యా (బెంగుళూరు) అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ పాఠశాలలో గురువారం పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులతో సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సింది గురువుకే అన్నారు. సాధారణ సిలబస్‌కు మించిన జ్ఞానం పొందినప్పుడే ప్రత్యేక విద్యార్థులుగా గుర్తింపు లభిస్తుందన్నారు. ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా ఒదిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, అకడమిక్ కో–ఆర్డినేటర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

జగ్గంపేట: అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో మెట్ట ప్రాంతంలో వరి నారుమళ్లు, నాట్లు వేసిన రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ సూచించారు. అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించిందన్నారు. మెట్టలో పలు చోట్ల రైతులు వెదజల్లు విధానంలో వరిసాగు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో పొలాల్లో నీరు నిల్వ ఉంటే పంట దెబ్బతింటుందని చెప్పారు. రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించి పంటలను కాపాడుకోవాలని సూచించారు.

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

కిర్లంపూడి: ఏకదాటిగా కురుస్తున్న వర్షాల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ జోకా అమృత సూచించారు. విత్తనాలు చల్లిన నారుమడి నీరు మూడు రోజుల కన్నా ఎక్కువ రోజులు నిల్వ ఉంటే మొలక శాతం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. వీలైనంత తొందరగా నీరు బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నష్ట నివారణకు 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో ఫొటాష్ వేసుకోవాలన్నారు. అధిక వర్షాలకు పంట తెగుళ్ల బారిన పడకుండా నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటిలో 1 గ్రాము కార్బెండిజం, మాంకోజెబ్ కలిపిన మిశ్రమం పిచికారీ చేయాలని సూచించారు.

ముంచెత్తిన వానలతో రైతన్న దిగాలు

- సరైన విధానాలు పాటిస్తే నారు మడులు, లేత మొక్కలకు రక్షణ
- రైతులకు అధికారుల సూచనలు



వరి నారుమడుల దృశ్యం

పెద్దాపురం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల సాధారణ జనజీవనానికే కాకుండా వ్యవసాయ రంగానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఇటీవల ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు, వరదలతో అతలాకుతలమైతే వ్యవసాయం రంగంలో రైతులకు జరిగే నష్టం అనంతం. వానాకాలం ప్రారంభంలోనే భారీ వర్షాలు కురవడంతో సాగు కష్టాలతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో ప్రధానంగా తొలకరి ఆరంభంలో అత్యధికంగా వరి సాగు అవుతుండగా కొన్ని ప్రాంతాల్లో కూరగాయలు, ప్రత్తి, ఇతర ఆహార పంటలు వేశారు. ప్రస్తుత వర్షాల వల్ల మొలకలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ముసురు వాన కురుస్తుండడంతో పిలక దశలోనే మొక్కలు, నారుమళ్లను కాపాడుకునేందుకు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి. నారుమళ్లు ఇప్పటి వరకు వేయని రైతులు వానలు తగ్గే వరకు వేచిచూసి తరువాత వేసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే విత్తనం కుళ్లిపోయి, మొలక శాతం తగ్గుతుంది. ఇప్పటికే వరి నారుమళ్లు వేసుకున్న రైతులు మడిలో నీరు నిల్వ ఉంచకుండా చూసుకుంటూ నీటిని బయటకు పంపేందుకు కాలువలను ఏర్పాటు చేసి నీటిని బయటకు తరలించాలి.

అలాగే కూలీల కొరతను అధిగమించడానికి యాజమాన్య ఖర్చులు తగ్గించుకోవడానికి వెదజల్లు సాగు ఉత్తమమైన పద్ధతని అధికారులు సూచిస్తున్నారు. ఈ పద్ధతిలో విత్తితే పొలాల్లో గాని నారుమడుల్లో గాని నీటిని తొలగించాలని. చిన్న మొక్కలు నీటి నిల్వను తట్టుకోవని వారు సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కలుపు మందులు వాడకుండా ఉండడమే మంచిదని వారు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు ఇలా..

- విత్తనాలు వేసిన వారు మొక్కలు పండువారి పేలవంగా ఉన్నచోట పైపాటుగా ఎకరా వరి నారు మడికి యూరియాను 15 నుంచి 20 కిలోల వరకు వేయాలి.
- చెలోటెండ్‌జింక్ గ్రాము లేదా జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- వరి నారుమడి నారు తీయడానికి వారం పది రోజుల ముందు తప్పనిసరిగా కార్బోఫోరాన్ 3జీ గుళికలు 800 గ్రాములు ఎకరాకు సరిపోయే రెండు గుంట నారుమడిని వేయాలి.

మొక్కజొన్న పంటలో...:

- మొక్కజొన్న పంటలో కూడా నిల్వ నీటిని కాలువలు, గండ్లు పెట్టి నీటిని తొలగించాలి. వర్షం తగ్గిన తరువాత బూస్టర్ మోతాదుగా ఎకరాలకు 35 కిలోల యూరియా, 15 కిలోల మూరేట్ఆఫ్ పొటాష్ వేయాలి. జింక్ బోరాన్ లోపాలు కనిపిస్తే బోరాన్ రెండు గ్రాములు, చిలేటెడ్‌జింక్ గ్రాము చొప్పున పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

కూరగాయల పంటలు..

- కూరగాయల పంటలకు ఈ వర్షాలతో ఆకు మచ్చకాండం, కుళ్లు తెగులు ఆశిస్తాయి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పోషక లోప నివారణకు 13–0–45 లీటర్ నీటికి పది గ్రాములు ఫార్ములా 42 కలిపి పిచికారీ చేయాలి.

యాజమాన్యం తప్పనిసరి



వర్షాలు కురుస్తున్నందువల్ల రైతులు సాగు పద్ధతుల్లో జాగ్రత్తలు పాటించాలి. నారుమళ్లు వేసిన వారు నారును రక్షించుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నారు వేయని వారు వర్షాలు తగ్గిన తరువాత విత్తుకోవాలి. వరి నారు, మొక్కజొన్న, కూరగాయలు వేసిన రైతులు వ్యవసాయ శాఖాధికారులు సూచించే సూచనలు తప్పకుండా పాటించాలి. తగిన మోతాదులో మాత్రమే ఎరువులు, రసాయనిక మందులు వేయాలి.

– సంజయ్‌కుమార్, వ్యవసాయ శాఖాదికారి, పెద్దాపురం

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



రాక్ సిరామిక్స్ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులో ఉన్న టైల్స్ ఫ్యాక్టరీలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని చేస్తున్న ఆందోళన గురువారం కూడా కొనసాగింది. 18 ఏళ్ల నుంచి చేస్తున్న తమను అన్యాయంగా విధుల నుంచి తొలగించి 94 రోజులు గడుస్తోందని కార్మికులు చంద్రశేఖర్, వరప్రసాద్, మంగారావు తెలిపారు. గత 30 రోజులుగా ఫ్యాక్టరీ గేటు ఎదురుగా ఆందోళన చేస్తున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు సార్లు జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద చర్చలు జరిగినా ఫ్యాక్టరీ యాజమాన్యం మంకు పట్టుదలతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, తొలగింపునకు గురైన కార్మికులు సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, శివనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, న్యాయవాదులు

- హెల్మెట్ తప్పనిసరిగా ధరించండి
- రవాణా శాఖాధికారి హరినాథరెడ్డి

పెద్దాపురం: రోడ్డు ప్రమాదాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని స్థానిక రవాణా శాఖాధికారి హరినాథ్‌రెడ్డి అన్నారు. న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ట్రాఫిక్ నియమాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ హరినాథరెడ్డి మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు యువత హెల్మెట్ తప్పని సరిగ్గా వినియోగించాలన్నారు. ఆకతాయి తనంగా వాహనాలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్ నియమ, నిబంధనలపై సీఐ రవికుమార్, ఎస్ఐ వెలుగుల సురేష్ తదితరులు అవగాహన కల్పించారు. న్యాయవాదులు బాపూజీ, దుర్గాప్రసాద్, మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, లక్ష్మి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

పిఠాపురం: హెల్మెట్ వినియోగం ఒక వ్యక్తే కాకుండా ఒక కుటుంబానికి రక్షణగా నిలుస్తుందని పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి అన్నారు. మండల లీగల సర్వీసెస్ కమిటీ, పిఠాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పిఠాపురంలో హెల్మెట్ ధారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అదనపు జిల్లా జడ్జి వాసంతి ప్రారంభించారు. కోర్టు ఆవరణ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా చర్చి సెంటర్ వరకూ ర్యాలీ సాగింది. న్యాయవాదులు హెల్మెట్‌లు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి వాసంతి మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్ట్ ధారణ ప్రమాదాల్లో వ్యక్తుల ప్రాణాలను రక్షిస్తుందన్నారు. సంపాదించే వ్యక్తిపైనే అతని కుటుంబం ఆధారపడి ఉంటుందని గుర్తించుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించేందుకు ప్రభుత్వం కచ్చితమైన చట్టాలు చేసిందన్నారు. వీటిని ప్రజలందరూ పాటించాలని కోరారు. మైనర్లకు మోటారు సైకిళ్లు ఇవ్వడం ద్వారా పెద్దలు కూడా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి ఎ.బాబు, జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజారావు, కేఎస్ భాస్కర్, ఉపాధ్యక్షులు అలీ, కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గెస్ట్ ప్రాతిపదికన జువాలజీ లెక్చరర్‌గా పని చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ జువాలజీలో 55% మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



ఇసుకపల్లిలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొత్తపల్లి: ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా అన్నారు. మండలంలోని ఇసుకపల్లిలో ప్రజలకు గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా, బాలల చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులు, అత్యాచారాలను బుర్రకథ కళాకారులు ప్రజలకు వివరించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పిల్లలను భవిష్యత్తు విద్యపైనే ఆధారపడి ఉందన్నారు. పని వద్దు – బడిముద్దు నినాదంతో పిల్లలను చదివించాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్లు సారమ్మ, అనంతలక్ష్మి, సుజాత వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సింహాచలం



పిఠాపురంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పిఠాపురం: రైతుల రైతులకు బేషరతుగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.సింహాచలం డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం పిఠాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.కృష్ణవేణికి రైతుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పెట్టుబడులకు అప్పులు చేస్తున్నారన్నారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయంగా ప్రతి రైతుకు అకౌంట్లో రూ.20 వేలు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే సమయంలో యజమాని సంతకం అనే షరతు వల్ల కౌలు రైతులు చాలా ఇబ్బంది పడ్డారన్నారు. ఇప్పుడు యజమాని సంతకం అవసరం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ కూలీలు మే, జూన్ నెలల్లో చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతుల సమస్యలపై ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రుద్రవరపు భూలోకం, కాలదారి రాఘవ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఊబ బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

12 గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెద్దాపురం: మండలంలోని 12 గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని దివిలి 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల వల్ల ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మండలంలోని చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, మర్లావ, గుడివాడ, సిరివాడ, తూర్పుపాకలు, దివిలి, తిరుపతి, చంద్రమాంపల్లి, పులిమేరు, గోరింట గ్రామాలకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వేట్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలో..

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెంలోని 33/11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎవీఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా హుస్సేన్‌పురం, వేట్లపాలెం, జి. మేడపాడు గ్రామాలకు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించాలన్నారు.

కొత్తపల్లి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, నిర్వహణ కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రభాకర్ గురువారం తెలిపారు. మండలంలోని వాకతిప్ప, అమీనాబాద్, ఉప్పాడ, కుతుకుడుమిల్లి, యండపల్లి, నాగులపల్లి, రమణక్కపేట, కొండేవరం, ఇసుకపల్లి గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

దేశం గర్వించదగ్గ నటుడు ఎస్వీఆర్

- వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: తెలుగు చిత్ర పరిశ్రమలో అద్భుత నటనతో కళాభిమానుల హృదయాలలో నిలిచిపోయిన మహానటుడు ఎస్వీ రంగారావు అని కాపునేత, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ పేర్కొన్నారు. కాకినాడలో ఎస్వీ రంగారావు 50వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. నాగమల్లితోట జంక్షన్ వద్ద ఎస్వీ రంగారావు కాంస్య విగ్రహానికి కురసాల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ బందిలి విరీష, పెదపాటి నాగబాబు, పుల్ల కోటేశ్వరరావు, శెట్టిబత్తుల కుమార్ రాజా తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ భారత దేశ గర్వించదగిన నటుడు ఎస్వీ రంగారావు అన్నారు. ఆయన నటించిన నర్తన శాల, మాయాబజార్ చిత్రాలను యువత చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్వీ రంగారావు అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో..

కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో ఎస్వీ రంగారావు వర్ధంతిని నాగమల్లి తోట వద్ద నిర్వహించారు. ఎస్వీ రంగారావు విగ్రహానికి వాసిరెడ్డి ఏసుదాసు, మాధవరావు, పట్టాభిరామయ్య తదితరులు నివాళులర్పించారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

రౌతులపూడి: మండలంలోని రైతులకు గురువారం ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. శృంగవరంలో ఆయిల్ పామ్ తోటలను మండల ఉద్యానవనశాఖ అధికారి పి.అరుణ్‌కుమార్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయల్ పామ్ సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలు అందిస్తామన్నారు. ఆయిల్ పామ్‌లో నాలుగేళ్ల పాటు అంతర పంటలుగా అరటి, కూరగాయలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు యాజ మాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

భౌమంటే గుండె గుభేలే..!

- స్మార్ట్ సిటీలో అంతకంతకూ పెరుగుతున్న కుక్కలు
- నియంత్రణలో మున్సిపల్ అధికారులు విఫలం
- ప్రమాదాలపాలవుతున్న ప్రజలు, చిన్నారులు



రామారావు పేటలో కుక్కలు అటకాయించడంతో భయంతో స్కూటర్ నిలిపివేసిన మహిళ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ స్మార్ట్ సిటీలో కుక్కలు అంతకంతకూ పెరిగి ప్రాణాంతకంగా తయారయ్యాయి. కాస్తంత చీకటి పడితే చాలు పాదచారులు, వాహన చోదకుల వెంటపడి వారిని కరవడమో లేదా వారంతట వారే ప్రమాదానికి గురయ్యే పరిస్థితిని కలిగిస్తున్నాయి. గాంధీనగర్, రామారావుపేట, సూర్యారావు పేట, ఎల్విన్ పేట, ప్రతాప్ నగర్, మెయిన్ రోడ్, వార్ఫురోడ్డు, సాంబమూర్తి నగర్, శాంతినగర్, శ్రీనగర్, వెంకట్ నగర్, గైగోలుపాడు, జగన్నాథపురం, రమణయ్యపేట, సర్పవరం, రామకృష్ణారావు పేట, ఇంద్రపాలెం తదితర ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. పెద్దవారి సంగతి అటుంచితే చిన్నారులు రోడ్లపై తిరిగే సందర్భాల్లో ఆకతాయితనంగా కుక్కలను ఆటపట్టించే సందర్భాలలోనో, లేదా అవే వీరిని అటకాయించే సందర్భంలోనో ఆ చిన్నారులు గాయాలపాలవుతున్నారు. అడపాదడపా మృత్యువాత పడుతున్నారు.

యానిమల్ బర్త్ కంట్రోల్ కమ్ యాంటీ రేబిస్ ప్రోగ్రామ్‌తో పాటు, కుక్కకాటుకు వ్యతిరేకంగా భద్రత, నివారణ చర్యలు గురించి పౌర సంక్షేమ సంఘాలతో అవగాహన కార్యక్రమాల నిర్వహణ అంతంత మాత్రంగా ఉండడంతో ఈ పరిస్థితి నెలకొందని సామాజికవేత్తలు అంటున్నారు. వీధి కుక్కలకు విచ్చల విడిగా వేటాడే స్వభావం ఉంటుందని జంతుశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. అవి సంచరిస్తున్న ప్రదేశంలో ఆహారం లభించకుంటే చిన్న చిన్న జంతువులను చంపి తింటాయని, ఆ క్రమంలో నిస్సహాయంగా ఉన్నవారిపైనా, చిన్నారులపైనా దాడులకు పాల్పడతాయంటున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం...

ప్రపంచ వ్యాప్తంగా రేబిస్ మరణాలలో 36 శాతం భారత దేశం నుంచే ఉండటం ఆందోళన కల్గిస్తోంది. అంటే 18 వేల నుంచి 20 వేల మరణాలు సంభవిస్తున్నాయి. 30 నుంచి 60 శాతం మృతుల్లో 15 ఏళ్లలోపు వారే ఎక్కువ. దేశంలో జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం–1960 ప్రాకారం జంతువులను హింసించడం, చంపడం చట్ట విరుద్ధం. వాటి జనాభా తగ్గించడం కోసం వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, టీకాలు వేయాల్సి ఉంటుంది.



గాంధీనగర్ ఎస్‌బీఐ వీధిలో గుంపులుగా ఉన్న వీధి కుక్కలు

వీధి కుక్కల యమ డేంజర్...

కుక్క కాటు వల్ల వైరస్ కాలు నుంచి శరీరంలోని ప్రవేశించిన తర్వాత రోజుకు అర సెంటీమీటరు చొప్పున పైకి ఎగబాకుతుంది. ఇది నరాలు, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. జ్వరం, తలనొప్పి, వాంతులు తొలిదశలో, పిచ్చిగా ప్రవర్తించడం, మనుషులను గుర్తించలేక పోవడం, నోటిలోంచి నురుగు రావడం, గొంతు పట్టేయడం, ఊపిరి ఆడకపోవడం వంటివి రెండో దశలో కనిపిస్తాయి. ఇక మూడో దశలో పూర్తిగా కోమాలోకి వెళ్లి, రెండు మూడు రోజుల్లో మృత్యువాత పడుతుంటారు.

చికిత్స ఇలా..



కుక్క కరిచిన వెంటనే ధారగా కారుతున్న నీటితో 10 నుంచి 15 నిమిషాల పాటు శుభ్రం చేయాలి. రక్తం కారుతున్నా గాయంపై కట్టు కట్టకూడదు. మట్టి, పసుపు, ఆకుపసరు వంటివి పోయకూడదు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. కరచిన తర్వాత ఒకటి, ఆ తర్వాత 3, 7, 14, 28 రోజుల్లో వ్యాక్సిన్లు వేసుకోవాలి. నగరంలో ఎక్కడైనా వీధి కుక్కలు క్రూరంగా మారితే వెంటనే దగ్గరలోని సచివాలయానికి తెలియజేస్తే సిబ్బంది వచ్చి వాటిని పట్టుకుని ఏబీసీ చేయించి వదిలేస్తారు.

– డాక్టర్ పృథ్వీచరణ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, కాకినాడ కార్పొరేషన్

పెరటి తోటల పెంపకంపై మహిళలకు శిక్షణ

గోకవరం: జిల్లా ప్రకృతి వ్యవసాయం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని కామరాజుపేటలో మహిళలకు పెరటి తోటల పెంపకంపై గురువారం అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఎంటీ ఎల్ దేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమతుల్య పోషకాహారం, మంచి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలు, శరీరానికి కావలసిన పోషక పదార్థాలు, కార్బోహైడ్రేట్లు, విటమిన్ల గురించి వివరించారు. వీటి కోసం పెరటిలోనే చిరుధాన్యాలను సాగు చేసుకోవాలని సూచించారు. దీనిలో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో 12 రకాల పెరటి తోటల విత్తనాలు, నారు మహిళలకు అందజేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రె నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరలక్ష్మి, మంగారత్నం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.